

నీళ్లులేక ఎండిపోయిన కాల్వ



నీళ్ల కోసం పొలంలో పైపు వేస్తున్న రైతు

# కాంగ్రెస్ తెచ్చిన కరువు

మొదటిపేజీ తరువాయి...

తేటతెల్లమవుతున్నది. ప్రభుత్వం తీరుతో పంటలు ఎండిపోతుండగా, రాష్ట్ర రైతాంగం ఆగమాగమవుతున్నది. నష్టాల బారినపడుతున్నది.

### కొరవడిన ప్రణాళిక

గత బీఆర్ఎస్ సర్కారు ప్రణాళికబద్ధంగా సాగు, తాగునీటి ఎద్దడి లేకుండా చూసేది. చెరువుల సంరక్షణ, పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టిని సారిస్తూ వచ్చింది. తద్వారానే రెండు పంటలకు సాగునీటి భరోసా లభించింది. యాసంగిలోనూ నిరందిగా పంటలు పండించుకునే పరిస్థితి ఉండేది. బీఆర్ఎస్ సర్కారు రాష్ట్రంలోని వేల చెరువులను అక్కడి మేజర్, మీడియం ప్రాజెక్టులకు అనుసంధానం చేసింది. ప్రధాన గోదావరిలో ఎగువ నుంచి ప్రవాహాలు తగ్గిన వెంటనే మేడిగడ్డ నుంచి ప్రాణహిత జలాలను ప్రధాన ప్రాజెక్టులకు ఎత్తిపోసేది. ఆ జలాలను ప్రాజెక్టుల ద్వారా చెరువులకు మళ్లించేది. ఏటా ప్రతి అక్టోబర్ లేదంటే డిసెంబర్‌లో చెరువులు, చెక్‌డ్యామ్‌లను క్రమం తప్పకుండా నింపుతూ ఉండేది. ఫలితంగా భూగర్భ జలాలు పడిపోకుండా ఉండేవి. 24 గంటల కరెంటుతో బోర్ల ద్వారా పంటలు పండేవి. చిన్న లిఫ్టులు కూడా సమర్థంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడింది. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారు ఈ ఏడాది ఆ పనేమీ చేయలేదు. వర్షాకాలంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లలో నిల్వ చేసిన నీటిలో కొద్ది మొత్తం విడుదల చేసి వాటి పరిధిలోని చెరువులు, చెక్‌డ్యామ్‌లను ఇటీవలే నింపింది. అదీ అక్కడి స్థానిక రైతులు రోడ్డెక్కి డిమాండ్ చేస్తేనే. మిగతా చోట్ల చెరువులను నింపకపోవటంతో భూగర్భజల మట్టాలు భారీగా పడిపోతున్నాయి. కరెంటు కోతల వల్ల బోర్లు కూడా పూర్తిస్థాయిలో నడవని దుస్థితి నెలకొన్నది. నీళ్లు లేక ఒక చోట పంటలు ఎండుతుంటే.. నీళ్లున్నా కరెంటు లేక పంటలు ఎండిపోతున్నాయి.

## మళ్లీ రోడ్డెక్కాలేమో!



**చిత్రంలో** ఉన్న రైతు పేరు చందు గంగారాం. ఈయనకు కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం బుడ్మి గ్రామశివారులో నిజాంసాగర్ డిస్ట్రిబ్యూటరీ కాలువ కింద మూడున్నర ఎకరాల పొలం ఉన్నది. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో విద్యుత్తు, సాగునీటి కొరత లేకపోవటంతో పుష్కలంగా పంటలు పండించుకునేవాడు. స్థానిక ఎమ్మెల్యే, మాజీ సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి రైతుల ఇబ్బందులను తెలుసుకొని పంటలను స్వయంగా పరిశీలించేవారు. సాగునీరు, విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకునేవారు. ప్రస్తుతం పరిస్థితి ఇందుకు భిన్నంగా మారింది. పంటలకు సాగునీరు అందటం లేదు. ఒకవైపు ఎండలు రోజురోజుకూ మండుతుండగా.. మరోవైపు పొలాల్లో నీళ్లు లేక నెర్రెలువారుతున్నాయి. దీంతో పంటలను సాగు చేయటం కష్టంగా ఉన్నదని అంటున్నాడు. రైతులకు అవసరాన్ని బట్టి నీటి విడుదల చేపట్టడం ఒక ఎత్తయితే, లీకేజీ నీటిని నిత్యం వదలటంతో పంటలకు నష్టం కలిగే అవకాశం ఉన్నదని ఆందోళన చెందుతున్నాడు. యాసంగిలో సాగునీటి ఇబ్బందులు తప్పేలా లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇప్పుడున్న లీడర్లకు సాగునీరు, పంట పొలాల పరిస్థితిపై అవగాహన లేనట్టు ఉన్నదని, దీంతో రైతులు మళ్లీ రోడ్డెక్కే పరిస్థితులు వచ్చేలా ఉన్నాయని అంటున్నాడు.

### అనాలోచిత నిర్ణయం

ఎస్సారెస్పీ స్టేజ్1లో అంటే ఎల్‌ఎండీకి ఎగువన అంటే ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువ 0-146 కిలోమీటర్ల వరకు 4,62,920 ఎకరాలు, దిగువన అంటే కాకతీయ కెనాల్ 146-284 కిలోమీటర్ల వరకు 5,05720 ఎకరాలు మొత్తంగా 9,68,640 ఎకరాల ఆయకట్టుకు నీరందించాల్సి ఉన్నది. కాకతీయ కాలువను 284 కిలోమీటర్ నుంచి 347 కిలోమీటర్ వరకు ఎస్సారెస్పీ స్టేజ్2గా పిలుస్తారు. దాని కింద 3,71,691 ఎకరాలు ఉన్నది. ఆ తర్వాత అది మూసీలో కలుస్తుంది. ఈ ఏడాది యాసంగిలో కూడా ఎస్సారెస్పీ స్టేజ్ 1, స్టేజీ2 కింద దాదాపు 11.26 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రతి ఏటా ఏ మేరకు నీరు తక్కువపడితే ఆ మేరకు జలాలను కాళేశ్వరం ద్వారా ఎత్తిపోస్తుండేవారు. నిరుడు దాదాపు 34 టీఎంసీలను కాళేశ్వరం ద్వారా ఎత్తిపోశారు. ఈసారి కూడా ఆ అంచనాతోనే అధికారులు ప్రణాళికలను సిద్ధం చేసినట్టు సమాచారం. కానీ ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది. నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉందన్న ధీమాతో అధికారులు 'టెయిల్ టు హెడ్' విధానం ప్రకారం, వారబందీని అమలు చేస్తూ స్టేజ్2కు సైతం నీరివ్వడం ప్రారంభించారు. ప్రస్తుతం అంచనా మేరకు నీటి నిల్వలు నిండుకున్నాయి. మరోవైపు ఈ ఏడాది మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటును సాకుగా చూపి నీటి ఎత్తిపోతలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపేసింది. ప్రాణహితలో ఇప్పటికీ 5 వేల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతున్నా ఎత్తిపోసేందుకు ససేమిరా అంటున్నది. ఇదిలా ఉంటే కాళేశ్వరం ద్వారా నీటిని ఎత్తిపోయకున్నా సుందిళ్ల, అన్నారంలో అప్పటికే నిల్వ ఉన్న నీళ్లనైనా ఎత్తిపోసి చెరువులను నింపినా ప్రస్తుతం పరిస్థితి వేరుగా ఉండేది. కానీ ప్రభుత్వం ఆ నీళ్లను సైతం వృథాగా దిగువకు విడుదల చేసింది. దీంతో ఆ నీటిని ఎత్తిపోసుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో ఎస్సారెస్పీ ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది.

### బద్నాం చేయాలనే ఆత్రుత తప్ప..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాళేశ్వరం ప్రాజెక్టును, గత బీఆర్ఎస్ సర్కారును బద్నాం చేయాలని చూసింది తప్ప యాసంగి సాగు నీటి అవసరాలు ఏమిటి? నీటిని ఎలా అందించటం? కార్యాచరణ ఏమిటి? అన్నదానిపై దృష్టి సారించలేదు. ఒకసారి మంత్రుల బృందం, మరోసారి సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రాజెక్టును సందర్శించారు తప్ప సాగునీటి అవసరాలపై మాత్రం అధికారులతో సమీక్షించింది లేదు. భవిష్యత్తు సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా జలాలను ఎత్తిపోసుకోవాలనే దానిపై దృష్టి సారించటం లేదు. కనీసం యాసంగి సాగుకు సిద్ధమవుతున్న రైతులనైనా అప్రమత్తం చేసిందా! అంటే అదీ లేదు. ఆ దిశగా ఆలోచించిందీ లేదు.

## కరెంట్‌షాక్‌కు ఇద్దరు రైతులు బలి


**మహబూబ్‌నగర్ జిల్లా పర్దీపూర్‌లో ఘటన**

దేవరకద్ర రూరల్ (చిన్నచింతకుంట), ఫిబ్రవరి 23: సాగునీటి కొరత రైతుల ప్రాణాలు బలితీసుకొంటున్నది. పొలాలకు నీటిని పెట్టేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై ఇద్దరు రైతులు మృతిచెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగింది. చిన్నచింతకుంట మండలం పర్దీపూర్‌కు చెందిన కుర్వ మల్లప్ప (50), గాజామోహన్‌రెడ్డి(55) రైతులు. పర్దీపూర్ రిజర్వాయర్ సమీపంలో మల్లప్పకు 6 ఎకరాలు, మోహన్‌రెడ్డికి 12 ఎకరాల పొలం ఉండగా.. వరి సాగు చేశారు. రిజర్వాయర్ నీటిని వీరిద్దరు ఒకే బోరు ద్వారా పంపింగ్ చేస్తూ పంటలు పండిస్తున్నారు. అయితే రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గి బోరుకు అందకపోవటంతో మోటర్‌ను నీళ్లు ఎక్కువగా ఉండే చోట ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అప్పటికే అక్కడి నుంచి బోర్లకు కనెక్షన్ ఉన్న వైర్ తెగిపోయింది. అది గమనించకుండా శుక్రవారం ఉదయం తమ మోటర్‌ను నీటిగుంత వద్ద బిగించేందుకు నీళ్లలోకి దిగగానే ఇద్దరూ విద్యుదాఘాతానికి గురై మృతిచెందారు. పోలీసులు పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు. మృతదేహాలను జిల్లా దవాఖానకు తరలించారు.

### రైతన్న ఆగమాగం

ఈ ఏడాది చెరువులు, చెక్‌డ్యామ్‌లను నింపకపోవటం వల్ల భూగర్భజలాలు పడిపోతున్నాయి. దీనికి భూగర్భ జలశాఖ నెలవారీ నివేదికలే నిదర్శనం. బోర్లు నడవటం కష్టంగా మారింది. కరెంటు కోతలు కూడా కొనసాగుతుండటంతో బోరుబావుల ద్వారా వ్యవసాయం ప్రశ్నార్థకంగా తయారైంది. ఇప్పటికే పలు చోట్ల పంటలు ఎండిపోతుండగా, రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నది.

## లోకం పోకడ




సాఫ్టవేర్ సంబంధానికిచ్చి నా బిడ్డ గొంతు కోయలేను పంతులూ.. ఏదైనా ఇసుక దందా సంబంధాలుంటే చూడు!

## నా వ్యాఖ్యలను వక్రీకరించారు

తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యాంప్రసాద్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి23 (నమస్తే తెలంగాణ): విశ్రాంత ఇంజినీర్ల సంఘం 2015లో ఇచ్చిన అధ్యయన నివేదిక అంశంపై తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి ఇటీవల ఓ దినపత్రిక వార్తను ప్రచురించిందని తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ నివేదికకు సంబంధించి తాను చెప్పిన అభిప్రాయాలకు భిన్నంగా కథనం ప్రచురించిందని, సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను సైతం తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం ఖండించినట్టు అందులో రాసిందని పేర్కొన్నారు. అది సరికాదని, ఆ పత్రిక కథనాన్ని ఖండిస్తున్నామని, భవిష్యత్తులో అలాంటి వార్తలు రాయకుండా ఉండాలని శ్యాంప్రసాద్‌రెడ్డి ఆ ప్రకటనలో కోరారు.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 14.1°c | 38.1°c |
| రంగారెడ్డి | 15.1°c | 37.6°c |
| మెదక్ | 15.6°c | 36.6°c |
| నిజామాబాద్ | 18.9°c | 34.0°c |
| హైదరాబాద్ | 20.0°c | 32.0°c |
| కరీంనగర్ | 21.0°c | 33.0°c |
| వరంగల్ | 22.0°c | 32.0°c |
| ఖమ్మం | 22.0°c | 33.0°c |
| మహబూబ్‌నగర్ | 22.1°c | 35.4°c |
| నల్లగొండ | 24.0°c | 32.0°c |

# యాసంగి ఆగమాగం

- **నిరుడితో పోల్చితే సాగు 10 లక్షల ఎకరాల మేర తక్కువ**
- **మరో 15 లక్షల ఎకరాల పంటలు ఎండిపోయే ప్రమాదం**
- **మునుపటి రోజులొస్తాయేమోనన్న ఆందోళనలో అన్నదాతలు**
- **కాళేశ్వరం ప్రాజెక్టుతో యాసంగి కరువు తీర్చిన కేసీఆర్**
- **9 ఏండ్లుగా పెరిగిన యాసంగి సాగు**

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): యాసంగి సాగు కరువు కోరల్లో చిక్కుకుంటున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన కృత్రిమ సాగునీటి కొరతతో పంటలు ఆగమవుతున్నాయి. మొన్నటివరకు ఏటికేడు పెరిగిన సాగు ఇప్పుడు తిరోగమనం వైపు మళ్లుతున్నది. ఇందుకు ఈ ఏడాది తగ్గిన పంటల సాగు, ఎండుతున్న పైరులే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. నిరుడితో పోల్చితే ఈ ఏడాది యాసంగిలో పంటల సాగు భారీగా తగ్గింది. ఏకంగా 10 లక్షల ఎకరాల్లో సాగు తగ్గడం ఆందోళన కలిగిస్తున్నది. నిరుడు యాసంగిలో 72.63 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగైతే ప్రస్తుతం ఇది 62.89 లక్షల ఎకరాలకే పరిమితమైంది. నాలుగేండ్లుగా పెరుగుదలే తప్ప, తగ్గని యాసంగి సాగు ఇప్పుడు మళ్లీ నేలచూపులు చూస్తున్నది.

### కాల్వల్లో పారని నీళ్లు

గత యాసంగి వరకు కేసీఆర్ ప్రభుత్వ సాగునీటి ప్రణాళికతో ఎర్రటి ఎండల్లోనూ కాలువల్లో నీళ్లు పారేవి. చెరువులు మత్తళ్లు దుంకేవి. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కాలువల్లో చుక్క నీరు కనిపించటం లేదు. చెరువులు నిండలేదు. మత్తళ్లు దూకడం లేదు. దీంతో సాగునీటి కటకట ఏర్పడింది. సాగు నీళ్లు ఇవ్వటంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనే విమర్శలున్నాయి. రాజకీయ ఎజెండాతో రైతులను బలిచేసే ప్రయత్నం చేస్తున్నదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. కొంత ప్రయత్నం చేస్తే కాళేశ్వరం ద్వారా సాగు నీళ్లు అందించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా కనీస ప్రయత్నం చేయలేదనే విమర్శలున్నాయి. తద్వారా ఆ ప్రాజెక్టు పరిధిలోని జలాశయాల్లో సాగునీటి ఎద్దడి ఏర్పడింది. ఓవైపు కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోయటంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం.. మరోవైపు సాగర్ ఆయకట్టుకు నీళ్లు అందించటంలోనూ విఫలమైంది.

**యాసంగి సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)**

| సంవత్సరం | పంటల సాగు విస్తీర్ణం |
|---|---|
| 2014-15 | 28,17,836 |
| 2015-16 | 19,91,800 |
| 2016-17 | 39,20,050 |
| 2017-18 | 38,08,796 |
| 2018-1 | 31,49,033 |
| 2019-20 | 53,82,358 |
| 2020-21 | 68,14,555 |
| 2021-22 | 54,41,985 |
| 2022-23 | 72,63,093 |
| 2023-24 | 62,89,776 |

### కాళేశ్వరం తీర్చిన కరువు.. పెరిగిన సాగు

కేసీఆర్ పకడ్బందీ ప్రణాళిక, రైతులకు మేలు చేయాలనే సంకల్పం యాసంగి కరువును తరిమేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుతో యాసంగిలో సాగునీటి కరువును తీర్చారు. ఫలితంగా యాసంగి సాగు వానకాలం సాగుతో పోటీ పడింది. ఈ ప్రాజెక్టును 2019 జూన్‌లో ప్రారంభించారు. 2019-20 యాసంగి సీజన్ నుంచి 2022-23 యాసంగి సీజన్ (గత ఏడాది) వరకు యాసంగి సాగులో భారీ పెరుగుదల నమోదైంది. రాష్ట్రం ఏర్పాటైన తొలినాళ్లతో పోల్చితే గత ఏడాది యాసంగి సీజన్ వరకు పంటల సాగు విస్తీర్ణం ఏకంగా 45 లక్షల ఎకరాలు పెరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి పంటల సాగు మరింత పెరిగింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యం కారణంగా యాసంగిలో సాగునీళ్ల కటకట మొదలైంది. దీంతో ఈసారి యాసంగి సాగు 62.89 లక్షల ఎకరాలకే పరిమితమైంది.



### 25 లక్షల ఎకరాలకు దెబ్బ!

నిరుడితో పోల్చితే ఇప్పటికే 10 లక్షల ఎకరాల్లో పంటల సాగు తగ్గగా, సాగైన పంటలు కూడా చేతికందే పరిస్థితి లేకుండా పోయింది. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, మెదక్ జిల్లాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉన్నది. కాళేశ్వరంపై కక్షతో సాగునీళ్లు ఎత్తిపోయకపోవడంతో ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. సాగర్ ఆయకట్టు రైతులను నీటి ఎద్దడి నుంచి ముందే అప్రమత్తం చేయటంలో విఫలమైంది. రైతులు పంట సాగు చేసిన తర్వాత తీరిగ్గా క్రాప్ హాలిడేను ప్రకటించింది. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 20-25 శాతం పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్నదని వ్యవసాయ, సాగునీటి నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### రైతుల్లో గుబులు

రైతులను మళ్లీ యాసంగి భయం వెంటాడుతున్నట్టు కనిపిస్తున్నది. సాగునీటి కొరతతో పంటలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత అనుభవాలను గుర్తు చేసుకొంటూ మళ్లీ పాత రోజులు వస్తాయేమోననే భయం వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ కోతలు, ఎండిన పంటలు, నష్టాలు వీటన్నింటినీ తలుచుకుంటూ భయపడుతున్నారు. ఎండిన పంటల్లో పశువులను మేపుతున్న, కాల్చుతున్న దృశ్యాలు మళ్లీ పునరావృతం అవుతున్నాయి.

## నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం

### ఎన్‌టీపీసీలో...

**నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌టీపీసీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 20
- పోస్టులు: అసిస్టెంట్ మేనేజర్ (సేఫ్టీ)
- అర్హతలు, ఎంపిక తదితరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: మార్చి 8
- వెబ్‌సైట్: www.ntpc.co.in

### ఆయిల్ ఇండియాలో...

**ఆయిల్ ఇండియా లిమిటెడ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 16
- పోస్టులు: సూపరింటెండెంట్ ఇంజినీర్
- అర్హతలు: బీఈ/బీటెక్ లేదా పీజీ (పెట్రోలియం ఇంజినీరింగ్/టెక్నాలజీ), ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: మార్చి 11
- వెబ్‌సైట్:https://www.oil-india.com

### ఎయిర్‌పోర్ట్స్ అథారిటీలో...

**ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 490
- పోస్టులు: జూనియర్ ఎగ్జిక్యూటివ్
- విభాగాలు: ఆర్కిటెక్చర్, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, ఐటీ, ఎలక్ట్రానిక్స్, సివిల్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: మే 1
- వెబ్‌సైట్: https://www.aai.aero

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

**పోటీ పరీక్షల ప్రత్యేకం**

- జాగ్రఫీ (డీఎస్సీ), జూనియర్, సీనియర్ ఇంటర్ సంస్కృతం మోడల్ పేపర్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

## 15 రోజుల్లో విజిలెన్స్ దాడులు

హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులకు సీఎం హెచ్చరిక

- **పారదర్శకంగా పనిచేయాలి.. లేదంటే ఇంటికెళ్తారు**
- **మున్సిపల్ శాఖపై సమీక్షలో సీఎం**

హైదరాబాద్/ హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్, మున్సిపల్ పరిపాలన విభాగాల్లో అక్రమాలను వెలికితీసేందుకు 15 రోజుల్లో విజిలెన్స్ దాడులు జరుగుతాయని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ యంత్రాంగం పారదర్శకంగా పనిచేయాలని, ఇష్టానుసారంగా వ్యవహరించే అధికారులు ఇంటికెళ్తారని హెచ్చరించారు. శుక్రవారం హెచ్ఎండీఏ కార్యాలయంలో వాటర్‌వర్క్స్, మున్సిపల్ పరిపాలన, జీహెచ్ఎంసీపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన అనుమతుల ఫైల్స్ క్లియర్‌గా ఉండాలని స్పష్టంచేశారు. చాలా భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన ఫైల్స్ కనబడటంలేదని, నిర్మాణరంగంలో ఆన్‌లైన్‌లో లేకుండా ఇష్టానుసారంగా ఇచ్చిన అనుమతుల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. హెచ్ఎండీఏ వెబ్‌సైట్ నుంచి చెరువుల డాటా ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. 3,500 చెరువుల సమాచారం ఆన్‌లైన్‌లో ఉండాల్సిందేనని స్పష్టంచేశారు. చెరువులు దురాక్రమణకు గురికాకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని సూచించారు. జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న సిబ్బందిలో వయసు పైబడినవారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని సీఎం సూచించారు. ఆస్తిపన్ను మదింపు కోసం డ్రోన్ కెమెరాలను ఉపయోగించే అంశంపై అధ్యయనం చేయాలని ఆదేశించారు.

### మార్చిలో డెయిరీ పరిశ్రమల జాతీయ సదస్సు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 23: హైదరాబాద్ మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మార్చి 4 నుంచి 6 వరకు 50వ డెయిరీ పరిశ్రమ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు ఐడీఏ తెలంగాణ చాప్టర్ చైర్మన్ సీహెచ్ రాజేశ్వర్‌రావు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సదస్సులో దేశ వ్యాప్తంగా పాడి రైతులు, పారిశ్రామికవేత్తలు, హాజరవుతారని తెలిపారు.

## రైతుబంధు నిధులు పక్కదారి!

- **ఏఈవో నిర్వాకంతో 64 మంది రైతులకు అందని సాయం**
- **పంట పెట్టుబడి సాయం నిధులు రూ.36 లక్షలు ఇతరుల ఖాతాల్లోకి..**
- **రైతు ఫిర్యాదుతో విషయం వెలుగులోకి**

గద్వాల, ఫిబ్రవరి 23 : జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఓ వ్యవసాయశాఖ అధికారి చేతివాటాన్ని ప్రదర్శించారు. రైతులకు అందాల్సిన రైతుబంధు సాయం బినామీ ఖాతాల్లో జమ అయ్యేలా చక్రం తిప్పారు. దాదాపు 64 మందికి సంబంధించిన రూ.36 లక్షలను పక్కదారి పట్టించారు. బాధిత రైతు ఫిర్యాదుతో అధికారి వ్యవహారం వెలుగుచూసింది. గట్టు మండలం బలిగేర ఏఈవోగా పనిచేసిన దివ్య ప్రస్తుతం మాచర్ల వ్యవసాయ విస్తరణ అధికారిగా కొనసాగుతున్నారు. బలిగేరలో పనిచేసే సమయంలో 64 మంది అర్హులైన రైతులకు చెందిన బ్యాంకు ఖాతాల వివరాలు వ్యవసాయశాఖకు పంపకుండా బినామీ రైతుల ఖాతాలు పంపారు. దీంతో రైతుబంధు నిధులు సుమారు రూ.36 లక్షలు ఇతరుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. అసలు రైతులు తమకు సాయం నిధులు జమకావడం లేదన్నా ఎవరూ పట్టించుకోలేదు. బలిగేరికి చెందిన ఓ రైతు రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో జిల్లా అధికారుల్లో చలనం వచ్చింది. రికార్డుల్లో పాస్‌బుక్ నంబర్లు సరిగా ఉన్నా నగదు ఇతరుల ఖాతాల్లో పడుతున్నట్టు గుర్తించారు. బాధ్యురాలైన దివ్యను గురువారం సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై విచారణ కొనసాగుతున్న సమయంలోనే మరో వ్యవసాయ విస్తరణ అధికారి తప్పుడు సర్టిఫికెట్‌తో ఉద్యోగంలో చేరగా.. ఈ విషయం బయటపడటంతో ఉద్యోగి రాజీనామా చేసినట్టు తెలిసింది.

## యాసంగి పంటల కొనుగోళ్లకు సిద్ధం

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): యాసంగి పంటల కొనుగోళ్లకు సిద్ధం కావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మార్కెట్లకు పంటలు తెస్తున్న రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని చెప్పారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏ పంటకైనా మద్దతు ధరకంటే తక్కువ వస్తే వెంటనే ప్రభుత్వం రంగంలోకి దిగి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నదని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. అవసరమైతే సెలవు రోజుల్లో కూడా మిర్చి క్రయ విక్రయాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. 54,29,645 మంది రైతులకు రైతుబంధు సాయం ఇప్పటికే అందజేశామని, మిగతా వారికి త్వరలోనే అందజేస్తామని మంత్రి వివరించారు. సమావేశంలో ఏపీసీ సెక్రెటరీ రఘునందన్‌రావు, అగ్రికల్చర్ డైరెక్టర్ బీ గోపి, మార్కెటింగ్ డైరెక్టర్ జీ లక్ష్మీబాయి, మార్క్‌ఫెడ్ ఎంపీ సీహెచ్ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

### సాగర్‌ను సందర్శించిన కేఆర్ఎంబీ సభ్యుడు

నందికొండ, ఫిబ్రవరి 23 : నాగార్జునసాగర్ డ్యాం జల విద్యుత్తు కేంద్రాలను కేఆర్ఎంబీ సభ్యుడు, ఈఈ శ్రీనివాస్ టెయిల్‌పాండ్ ఎస్ఈ రమణతో కలిసి శుక్రవారం సందర్శించారు. మెయింటెనెన్స్ పనులు చేయడానికి డ్యామ్‌పైకి సీఆర్‌పీఎఫ్ బలగాలు అనుమతించడం లేదని తెలంగాణ అధికారులు కేంద్రానికి లేఖ రాశారు. ఈ లేఖకు స్పందిస్తూ కేఆర్ఎంబీ సభ్యుడు శ్రీనివాస్ తెలంగాణలోని పవర్‌హౌస్‌కు సంబంధించి సాగర్‌తో అనుసంధానమైన పెన్‌స్టాగ్ గేట్లను పరిశీలించారు.